# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

https://trinetnews.com/

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

4 P M to 7 P M

సంపుటి: 01 | సంచిక:19 | పేజీలు :04 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | శుక్రవారం , సెప్టెంబర్ 04,2026


## భారతీయ సాంప్రదాయ కళలను భావితరాలకు
# అందించాలి

**హైదరాబాద్, రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4 :**

భారతీయ సాంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు రమణారావు అన్నారు. శివ పార్వతి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో 'మంజీరనాదం' పేరిట సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు రవీంద్రభారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమణారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ నృత్య, కళా సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. తమ పిల్లలను కళా రంగంలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. సభకు ముందు శివ పార్వతి నాట్య అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ చెట్టి నాగ శేఖర్ నిర్వహణలో కళాకారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు







ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డా. ఆర్. ప్రసన్న రాణి, దేదీప్య రావు, హరినాథ్ రెడ్డి, సత్య మాస్టర్, డా. శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటికి కొంచెం పొంగు
# ఎక్కువైంది
## : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి




**ట్రైనెట్ న్యూస్,సెప్టెంబర్ 4**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కొంచెం పొంగు ఎక్కువైంది అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 22ఏలో మా భూములు పెట్టి మమ్మల్నే అడుగుతారా అని రెవెన్యూ మంత్రి పొంగులేటి దగ్గరికి, రేవంత్ దగ్గరికి పోయి మా భూములన్న వదలండని మంత్రులు బ్రతిమిలాడుకుంటున్నారు. ఒకరిద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరిస్థితి కూడా అదే ఉందన్నారు.పోలవరం మొదలు పెట్టింది ఎప్పుడు? పనులు ప్రారంభించింది ఎవరు? అని ప్రశ్నించారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటా దక్కదని పోలవరం కట్టొద్దని ఆనాడు కేసు వేసిందే మేము. మేము శంకుస్థాపనలు చేసి 90 శాతం కడితే వీళు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని మండిపడ్డారు.మేము తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం లేదు.. రేవంత్ రెడ్డి కుటుంబ అభివృద్ధిని అడ్డుకుంటున్నామని స్పష్టం చేశారు.కొందరు మంత్రుల భూములని తెలియక వాళ్ల బినామీలని పిలిచి నిషేధిత జాబితాలో నుండి తీసేస్తామని 30 శాతం కమిషన్ ఇవాలని పైరవీకారులు అడిగారు. ఇది తెలంగాణలో నేడు కాంగ్రెస్ పాలన అని అన్నారు. అలాగే కొండా సురేఖను బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకునే ఆలోచన మాకు లేదు.. మా వైపు నుండి ఆ ప్రయత్నం కూడా లేదని స్పష్టం చేశారు.

## ఘనంగా కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు

**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్,సెప్టెంబర్ 4 :**

హైదరాబాద్ నగర తొలి మేయర్, పత్రికా సంపాదకుడు, సంఘ సంస్కర్త కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు శుక్రవారం సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్ ఘనంగా నిర్వహించారు. కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు జి దివాకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఉత్సవాలకుముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి. హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి ముదిరాజ్ జీవిత చరిత్ర పుస్తకాలను విడుదల చేశారు. అణగారిన వర్గాల ప్రజల కోసం ఎంతో సేవ చేసిన కొరివి కృష్ణస్వామి అందరికీ ఆదర్శనీయుడని వారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా ఎన్నికైన ఉమారాణి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీ చైర్మన్ అంజమ్మ ను అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు దినకర్ బాబు, జగన్మోహన్, ముదిరాజ్ మహాసభ నాయకులు కృష్ణమూర్తి, మన్మోహన్, చెన్నయ్య, శారద, సురేందర్ వెంకట్రావు, మంద శ్రీనివాస్, ఆంజనేయులు, నీలం శ్రీనివాస్, ప్రకాష్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



## శ్రీ కృష్ణాష్టమి వేడుకలో పాల్గొన్న శ్రీ మర్రి పురురవ రెడ్డి గారు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 4:**

శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని, స్థానిక బీజేపీ నాయకులు మంచాల గోపి గారు మొండా మార్కెట్ రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర బీజేపీ యువ నాయకులు శ్రీ మర్రి పురురవ రెడ్డి గారు పాల్గొన్నారు. ముందుగా శ్రీ మర్రి పురురవ రెడ్డి గారు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంచాల గోపి గారు, అంజిరెడ్డి గారు శ్రీ మర్రి పురురవ రెడ్డి గారికి శ్రీకృష్ణుడు, శ్రీ సాయిబాబా తీర్థప్రసాదాలను అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ శ్రీ రాజశేఖర్ రెడ్డి గారు, శ్రీ గణేష్ గారు, చంద్రపాల్ రెడ్డి, బి. వికాస్, కె. నరేష్ తదితరులు పాల్గొన్నారు.





# అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగించబడదు..


## ఓటర్లకు భరోసా కల్పించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి..

**తార్నాక, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4 :**

అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా తొలగించబడదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తార్నాక, లాలాపేట్ హియరింగ్ కేంద్రాలను శుక్రవారం జీహెచ్ఎంసి అదనపు కమిషనర్ (ఎన్నికలు) సంతోష్ తో కలిసి ఆయన సందర్శించి ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియను పరిశీలించారు. హియరింగ్ కు హాజరైన ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సందేహాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిఎల్ఓ లు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓ లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా అన్ మ్యాపింగ్ , అనోమలిస్ కు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ఆధారాలు, డాక్యుమెంట్ ను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఓటర్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా హియరింగ్స్ నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియ ఏ ఎస్ ఎస్ డి (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ అండ్ డూప్లికేట్) ఓటర్ల వివరాల పునఃపరిశీలనలో భాగమని అధికారులు తెలిపారు.

**ఫారం - 6, 7, 8 ద్వారా దరఖాస్తులకు అవకాశం.**

ఓటరు నమోదు, వివరాల్లో మార్పులు, తొలగింపు లేదా ఇతర సవరణల కోసం ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఓటర్లు తమ క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, హెల్ప్‌డెస్క్‌లు, ఈఆర్ఓ కార్యాలయంలో సమర్పించ వచ్చని సూచించారు. ఓటర్లలో విస్తృత



అవగాహన కల్పించేందుకు 70 - సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తొలి దశలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో, రెండో దశలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏ ఎస్ ఎస్ డి, అన్ మ్యాపింగ్ , అనోమలిస్, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ను, వివిధ ఫారాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ ఎంఎన్ఆర్ జ్యోతి, ఏఈఆర్ఓ ఎస్ అండ్ డిసి, సుధీర్ సింగ్, అదనపు ఏఈఆర్ఓ నాగమణి, బిఎల్ఓ లు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అంబర్ పేట్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- ఆకట్టుకున్న కృష్ణుని వేషధారణలో చిన్నారులు
- వివిధ ప్రాంతాలలో ఉట్టి కొట్టిన యువకులు



**హైదరాబాద్, చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**

శ్రీమహావిష్ణువు అవతారాల్లో శ్రీకృష్ణుడి అవతారం అత్యంత విశిష్టమైనది. అధర్మాన్ని అంతం చేసి ధర్మాన్ని స్థాపించేందుకు భగవంతుడు శ్రీకృష్ణుడిగా అవతరించిన పవిత్రమైన రోజునే శ్రీకృష్ణ జన్మాష్టమిగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఉపవాసాలతో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు . తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలంకరించడం పండుగకు మరింత శోభను తీసుకొచ్చారు. కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీకృష్ణుడి బాల్య లీలలను గుర్తుచేసుకుంటూ యువత, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టి కార్యక్రమాల్లోపాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కోలాటాలు, నృత్య ప్రదర్శనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు కేవలం భక్తులకు ఆరాధ్యదైవం మాత్రమే కాకుండా, మానవాళికి మార్గదర్శకుడని ఉజ్జల సంస్థ అధ్యక్షురాలు ఎం. లక్ష్మీ అన్నారు. మహాభారత యుద్ధ సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు అందించిన భగవద్గీత బోధనలు నేటికీ ప్రపంచానికి స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. ధర్మాన్ని కాపాడేవారిని ధర్మమే కాపాడుతుందనే సందేశాన్ని ప్రజలు జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజంలో మానవతా విలువలను పెంపొందించాలన్నారు.








పండుగల వేళ నాగ్‌పూర్ పోలీసుల కీలక నిర్ణయం..

# డీజేలు, బీమ్‌లైట్లపై నిషేధం



ట్రైనెట్ న్యూస్,సెప్టెంబర్ 4

వరుసగా పండుగలు రాబోతున్న వేళ మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పట్టణ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పట్టణ పరిధిలో డీజేలు, మోడిఫైడ్ సౌండ్ సిస్టమ్స్, బీమ్ లైట్స్, లేజర్ బీమ్‌లైట్స్, డీజే వాహనాలపై నిషేధం విధించారు. ఈ నిషేధం నవంబర్ 1 వరకు అమలులో ఉంటుందని నాగ్‌పూర్ సిటీ పోలీస్ కమిషనర్ విశ్వాస్ నాగ్రే పాటిల్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆదేశాలు జారీ చేశారు.పట్టణ పరిధిలోని ప్రతి ఒక్కరూ ఈ ఆదేశాల్ని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే, నిబంధనలకు అనుగుణంగా నడిచే సౌండ్ సిస్టమ్స్.. అంటే టాప్, మిడ్, బేస్‌తో కూడిన మల్టీ స్పీకర్ సిస్టమ్స్, ప్లాస్మా సౌండ్ సిస్టమ్స్, ప్రెజరైజ్డ్ సౌండ్ సిస్టమ్స్ వంటి వాటికి ఈ నిషేధం వర్తించదని తెలిపారు. ఈ నిర్ణయంపై నాగ్‌పూర్ పట్టణ డీసీపీ రాహుల్ మదానే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఈ ఆదేశాలు పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, ఈ నిర్ణయాన్ని కొందరు సమర్థిస్తుంటే.. మరికొందరు విమర్శిస్తున్నారు.త్వరలో పండుగల సీజన్ ప్రారంభమవ్వబోతుంది. వినాయక చవితి, దసరా నవరాత్రులు వంటివి ఘనంగా జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో సీపీ ఆదేశాలు జారీ చేయడంపై పలు హిందూ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. హిందూ పండుగలప్పుడే ఇలాంటి రూల్స్ పెడతారని వీహెచ్‌పీ ఆరోపిస్తోంది. స్థానిక వీహెచ్‌పీ నేత అమోల్ థాక్రే ఈ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఈద్ సందర్భంగా కూడా ఇలాంటి నిషేధమే విధించాలని సీపీకి ఫిర్యాదు చేసినప్పటికీ అప్పుడు పట్టించుకోలేదని, ఇప్పుడు హిందూ పండుగల సందర్భంగా మాత్రం నిషేధం విధిస్తున్నారని ఆయన మండిపడ్డారు.హిందూ పండుగలను తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. అంతేకాదు.. కృష్ణ జన్మాష్టమి వేడుకల్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 6న డీజే నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. సీపీ నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. బీజేపీ కూడా పోలీసుల నిర్ణయాన్ని తప్పుబట్టింది. హిందూ పండుగల సమయంలోనే ఇలాంటి నిషేధాజ్ఞలు ఎందుకు అమలు చేస్తున్నారని సెంట్రల్ నాగ్‌పూర్ బీజేపీ ఎమ్మెల్యే ప్రవీణ్ దత్కే ప్రశ్నించారు.పండుగల సందర్భంగా నిబంధనలకు అనుగుణంగా డీజే నిర్వహిస్తామని ఆయన అన్నారు. తాము పోలీసుల ఆజ్ఞల్ని తప్పుబట్టడం లేదని, అయితే ఈ సమయంలోనే ఆదేశాలు ఇవ్వడంపైనే తమ అభ్యంతరం అని వివరించారు.

# డా. వర్షిత్ రెడ్డి కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుంది: ఎంపీ డా. లక్ష్మణ్..

యశోద ఆసుపత్రిలో వర్షిత్ తల్లిని పరామర్శించిన డా. కె..లక్ష్మణ్..

సికింద్రాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:



నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా. వర్షిత్ రెడ్డి కుటుంబంపై జరిగిన దాడిని బీజేపీ తీవ్రంగా ఖండించింది. రాజకీయ విభేదాలను దాడులు, బెదిరింపుల రూపంలో వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డా. వర్షిత్ రెడ్డి తల్లిని బీజేపీ ఎంపీ డా. కె. లక్ష్మణ్, సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్ గౌడ్, డా. శ్రీరామ్ వెంకటేష్ తదితర నాయకులు పరామర్శించారు. డా. లక్ష్మణ్ ఆమెకు ధైర్యం చెప్పి, కుటుంబానికి బీజేపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. డా. వరశిత్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడి ఘటనపై డా. కె. లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుల కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం సరికాదన్నారు. రాజకీయ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే జరగాలని, దాడులు, బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భరత్ గౌడ్ మాట్లాడుతూ డా. వరశిత్ రెడ్డి కుటుంబానికి తెలంగాణ బీజేపీ నాయకత్వం, కార్యకర్తలు అండగా ఉంటారని తెలిపారు. కష్టకాలంలో ప్రతి బీజేపీ కార్యకర్త కుటుంబం వెంటే పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ నాయకుడు డా. శ్రీరామ్ వెంకటేష్ యశోద ఆసుపత్రిని సందర్శించి డా. వర్షిత్ రెడ్డి తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి తన సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు.

# తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యం లో వంట వార్పు కార్యక్రమం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,సెప్టెంబర్,4.

కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల వైఫల్యాలను నిరసిస్తూ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు శుక్రవారం పద్మారావు నగర్ చౌరస్తాలో దీ=జా పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యం లో వంట వార్పు కార్యక్రమం నిర్వహించరు.. అధికారం లో కి రాక ముందు కళ్ల బొల్లి మాటలు చెప్పి అధికారం లోకి వచ్చిన తర్వాత హామీలన్నింటినీ తుంగలో తొక్కారని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన విమర్శించారు.. మహిళకు 2500 నగదు, కల్యాణ లక్ష్మి పథకం అమలు తో పాటు తులం బంగారం, మహిళలకు స్కూటీలో ఇస్తామని హామీ ఇచ్చారని పార్టీ అధికారం లోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు.. నిరసన కార్యక్రమాలు భాగంగా రేపు శనివారం ఎస్పీ కాలేజ్ ప్రాంగణం నుంచి ఫీజ్ రీయింబర్స్మెంట్ అమలు చేయని కారణంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తామని కార్యక్రమంలో ఎశ్రీఖ తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొంటారని పవన్ కుమార్ తెలిపారు.. వంట వార్పు కార్యక్రమం లో ఏసూరి మహేష్, డివిజన్ అధ్యక్షులు రాజు, వెంకట రమణ, శ్రీకాంత్ రెడ్డి, కౌసల్య, అమృత,అనిత, నాగలక్ష్మి, లక్ష్మి దుర్గా కుశాల్ అంబులెన్స్ సురేష్, మహేందర్ గౌడ్, సుధాకర్ రెడ్డి, లంబూ శ్రీనివాస్, ముక్క శ్రీనివాస్, పాషా తదితరులు పాల్గొన్నారు....







# ఇస్కాన్ ఆలయంలో నితీశ్ కుమార్ పూజలు

పాట్నా: ట్రైనెట్ న్యూస్,సెప్టెంబర్ 4

బీహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్. ఇవాళ పాట్నాలోని ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం కోరుతూ ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించిన ఆయన తొలుత కృష్ణభగవానుడికి పువ్వులను సమర్పించారు. జ్యోతిని వెలిగించారు. శ్రీకృష్ణుడికి హారతి ఇచ్చారు. ఆ తర్వాత ఆలయ పూజారులు మాజీ సీఎం నితీశ్‌ను సత్కరించారు. నితీశ్ రాక సమయంలో ఇస్కాన్ ఆలయంలో సంప్రదాయ భజనలు, కీర్తనలు చేశారు.పవిత్ర ఉత్సవం రోజున నితీశ్ ఆలయాన్ని విజిట్ చేయడం సంతోషకరమని బీహార్ విద్యాశాఖ మంత్రి మితిలేశ్ తివారీ తెలిపారు. బీహార్ ప్రజల శాంతి, సుఖం కోసం నితీశ్ ప్రార్థనలు చేసినట్లు మంత్రి తెలిపారు. పార్టీ నేత సంజయ్ జా శిరస్సుపై నితీశ్ శతారీని పెట్టడం పవిత్ర ఘటనగా అభివర్ణించారు. సాంస్కృతిక, సంప్రదాయ విలువలను కాపాడేందుకు బీహార్ సర్కారు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రతి పౌరుడి సంతోషం, ఆరోగ్యం, సౌభాగ్యం కోసం తాము ప్రార్థనలు చేస్తున్నట్లు చెప్పారు.



# నిరుద్యోగ విద్యార్థుల మధ్య ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:

మూషిరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు శుక్రవారం సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఘనంగా నిర్వహించారు. కవి, వ్యాసకర్త, సమీక్షకులు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు మిద్దె సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహా పాల్గొని కేక్ కట్ చేసి ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందించడం అభినందనీయమన్నారు . ముఠా గోపాల్ ముషీరాబాద్ నియోజకవర్గంలో మచ్చ లేని నాయకుడిగా పేరు ప్రఖ్యాతిని సంపాదించుకున్నారని తెలిపారు. ముషీరాబాద్ ప్రజల అండ ముఠా గోపాల్ కు ఉందన్నారు. వచ్చే ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. యువత విద్యా రంగంలో ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు . కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, సీనియర్ నాయకులు ముఠా నరేష్, శ్రీనివాస్ గుప్తా, సత్యనారాయణ, ప్రేమ్, జాగీర్, రవి శంకర్ గుప్తా, కుమారస్వామి, సంతోష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# ఓయూ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## ఉస్మానియా యూనివర్సిటీ...

హైదారాబాద్, తార్నాక, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 4:

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి యాదవ కార్పొరేషన్ చైర్మన్ జగదీష్ యాదవ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమంలో అతిథులు, విద్యార్థి సంఘాల నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు తన జీవితంలో ధర్మాన్ని, న్యాయాన్ని, సమాజ శ్రేయస్సును బోధించారని పేర్కొన్నారు.కృష్ణ తత్వం నుంచి నేటి యువత నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలో ధర్మబద్ధమైన విలువలను పెంపొందిస్తూ, అందరూ కలలు కంటున్న సామాజిక తెలంగాణ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రమేష్ యాదవ్, మహేష్ గౌడ్, చేరాల వంశీ, సైదులు యాదవ్, మానవతా రాయ్, వేణు తో పాటు పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# హామీలను అమలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నాచారం, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 4:

కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 1000 రోజుల పాలనలో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నాచారం, హెచ్ఎంటి నగర్ డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో యూకే సినీప్లెక్స్ వద్ద రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై రోడ్డుపై వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చి, ప్రస్తుతం రాష్ట్ర ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని విమర్శించారు.ఒకవైపు హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల నివాసాలను కూల్చివేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు 22–యా నిషేధిత జాబితా పేరుతో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లను సైతం నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీఎంసీ ఎమ్మెల్యే లేఖపై కేంద్రం స్పందన..

## బెంగాల్ ప్రతిపక్ష నేత లైంగిక దాడి ఆరోపణలపై విచారణకు ఆదేశం



కోల్‌కతా: ట్రైనెట్ న్యూస్,సెప్టెంబర్ 4

టీఎంసీ ఎమ్మెల్యే లేఖపై కేంద్ర హోంశాఖ స్పదించింది. పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత రిటబ్రత బెనర్జీపై గతంలో వచ్చిన లైంగిక దాడి ఆరోపణలపై విచారణ జరుపాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బెంగాల్‌లోని బీజేపీ ప్రభుత్వాన్ని ఈ మేరకు లేఖ ద్వారా కోరింది. రిటబ్రత బెనర్జీ పెళ్లి పేరుతో తనను లొంగదీసుకుని లైంగిక దోపిడీకి పాల్పడినట్లు 30 ఏళ్ల మహిళ 2017లో ఆరోపించింది. ఆయనతో ఉన్న సన్నిహిత ఫోటోలను కూడా ఆమె పోస్ట్ చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అప్పటి బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో పాటు నాటి మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీకి ఆ పోస్ట్‌ను ట్యాగ్ చేసింది. బలుర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు కూడా నమోదైంది.కాగా, మమతా బెనర్జీ వర్గానికి చెందిన టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ తాజాగా ఈ కేసును గుర్తుచేశారు.వివాహం చేసుకుంటానని నమ్మించి ఒక మహిళపై లైంగిక దాడికి పాల్పడిన పాత ఆరోపణలకు సంబంధించి రిటబ్రతపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. కేంద్ర హోంశాఖ దీనిపై స్పందించింది. బెంగాల్ ప్రతిపక్ష నేత, టీఎంసీ అసమ్మతి నేత అయిన రిటబ్రత బెనర్జీపై, టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ చేసిన తీవ్రమైన లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలను పరిశీలించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయాన్ని తగిన విధంగా పరిశీలించి, ఆ ఎమ్మెల్యే (కునాల్ ఘోష్)కు సమాధానం పంపాలని కోరుతూ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హోంశాఖ లేఖ రాసింది.మరోవైపు టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ ఈ లేఖను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఆ మహిళ ఫిర్యాదుపై ఏం జరిగిందో పరిశీలించాల్సిన అవసరం ఉంది. రిటబ్రత బెనర్జీని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించదని నేను ఆశిస్తున్నా. ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించే ఏ అధికారిపైనైనా సరే, నేను తగిన చర్యలు తీసుకుంటా' అని ఆయన ట్వీట్ చేశారు. రిటబ్రత ఇప్పుడు ఏదో ఒక సాకుతో ఢిల్లీకి వెళ్లి బీజేపీ నాయకుల కాళ్లు నాకడానికి సిద్ధపడతారని ఆయన విమర్శించారు .కాగా, తనపై వచ్చిన ఈ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని రిటబ్రత బెనర్జీ అప్పట్లో ఆరోపించారు. సీపీఎం నుంచి బహిష్కరణకు గురైన ఆయనను బెంగాల్ సీఐడీ ఈ కేసుపై విచారించింది. 2018లో ఆయన టీఎంసీలో చేరడంతో ఆ కేసు సద్దుమణిగింది.అయితే ఈ ఏడాది జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓడిన నేపథ్యంలో ఎమ్మెల్యేగా గెలిచిన రిటాబ్రత మరో 59 మంది ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. మమతా వర్గం నుంచి నిరసనలు వ్యక్తమైనప్పటికీ, రిటాబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీ స్పీకర్ గుర్తించారు.